తెలుగు దినపత్రిక

ప్రభాత jayabheridaily.com

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

jayabherinews

10-05-2024

శుక్రవారం

మల్కాజిగిరి

సంపుటి : 01 | సంచిక : 262 | పేజీలు : 8 | వెల : 4



జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..

ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం

అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత

jayabherinews@gmail.com

jayabheridaily.com

+91 9391 544 889

JB జయభేరి




## ఈసారి తెలంగాణలో 10కి పైగా సీట్లు గెలుస్తాం

▸ భువనగిరి సభలో అమిత్ షా

తెలంగాణలో బీజేపీ అగ్రనేతల ప్రచారం జోరుగా సాగుతోంది. నిన్న పలు సభల్లో మోదీ పాల్గొనగా... అమిత్ షా భువనగిరిలో నిర్వహించిన సభలో పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరిలో తలపెట్టిన సభలో బీజేపీ అగ్రనేత అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ప్రధాని మోదీని మూడోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. 400 సీట్లను సాధించాలంటే భువనగిరిలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీని 10కి పైగా లోక్‌సభ స్థానాలతో ఆశీర్వదించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, బుజ్జగింపు రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. తెలంగాణలో గత ఎన్నికల్లో బీజేపీ 4 లోక్‌సభ సీట్లు గెలిచిందని అమిత్ షా గుర్తు చేశారు. ఈసారి 10కి పైగా గెలుస్తామని చెప్పారు. కాంగ్రెస్,బీఆర్ఎస్ ఎంఐఎం మధ్య  బంధం ఉందని ఆరోపించారు అమిత్ షా. మూడు పార్టీలు హైదరాబాద్ విమోచన దినోత్సవం నిర్వహించవని గుర్తు చేశారు. రద్దు చేసిన ట్రిపుల్ తలాక్‌ను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఏ అంటే అసదుద్దీన్, బీ అంటే బీఆర్ఎస్, సీ అంటే కాంగ్రెస్... ఈ మూడు పార్టీలు ఒక్కటే అని చెప్పారు అమిత్ షా. వీరి మధ్య త్రికోణ బంధం ఉందన్నారు. శ్రీరామనవమి నిర్వహిస్తే ఈ పార్టీలు ఆంక్షలు విధిస్తారని అన్నారు. సీఏఏను వ్యతిరేస్తున్నారని విమర్శించారు. ఈ మూడు పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.



## ప్రతి మహిళకు ఏడాదికి ₹ లక్ష

✍ జయభేరి, మెదక్:

▸ రాజ్యాంగంతోనే దేశంలో పేదలకు బలమైన శక్తి వచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగం అనే పుస్తకం మాములు పుస్తకం కాదని, మహా మహా మేధావులు ఏళ్ల తరబడి కృషి చేసి దేశానికి రాజ్యాంగం అందించారన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిర్వహించిన జనజాతర సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీపై విమర్శల దాడికి దిగారు. ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా, ఆర్ఎస్సెఎస్ రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. విద్య, ఉద్యోగాలు, ఓటుహక్కు అన్నీ మనకు రాజ్యాంగం ద్వారానే వచ్చాయని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. రాజ్యాంగంతో పాటు రిజర్వేషన్లు కూడా రద్దు చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని రాహుల్ ఆరోపించారు. రిజర్వేషన్లు రద్దు చేసేందుకే ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను విక్రయించి అన్నీ ప్రైవేటుపరం చేస్తున్నారని, క్రమంగా ప్రైవేటీకరణ పెంచి రిజర్వేషన్లు రద్దు చేయాలనేది బీజేపీ ఆలోచన అని రాహుల్ ఆరోపించారు. దేశంలో 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం దక్కటం లేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. వెనుకబడిన వర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో ముందు లెక్కలు తేలాలన్నారు. ఒకసారి జనగణన చేస్తేనే.. ఎవరు ఎంత శాతం ఉన్నారో తెలుస్తుందని రాహుల్ స్పష్టం చేశారు. మోడీ గత పదేళ్లలో విమానాశ్రయాలు, పోర్టులు, భారీ పరిశ్రమలను విక్రయించారని రాహుల్ ఆరోపించారు. కేవలం 2 శాతం ఉన్న బిలియనీర్ల చేతిలోకి దేశ సంపద అంతా వెళ్తోందని, ప్రపంచంలో ఏ ప్రభుత్వం కూడా ఇంతగా ప్రైవేటును ప్రోత్సహించలేదన్నారు రాహుల్. పెట్టుబడిదారులకు బీజేపీ కొమ్ముకాస్తోందని ఆరోపించారు. దేశంలోని

...మిగతాది 2 లో

## మెదక్ కోసం రంగంలోకి కేసీఆర్



✍ జయభేరి, మెదక్, మే 9 :

రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తోంది. ప్రధాన పార్టీలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఇక రోడ్ షో ద్వారా ప్రజల్లోకి వెళ్తున్న కేసీఆర్... మెదక్ లోక్ సభ నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఏదైనా లోక్ సభ స్థానంలో తప్పకుండా గెలుస్తుందని ఆ పార్టీ గట్టి నమ్మే లిస్ట్ లో మెదక్ ఫస్ట్ ప్లేస్ లో ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు తర్వాత... మెదక్ లోక్ సభ నియోజకవర్గానికి జరిగిన ఐదు ఎన్నికల్లో కూడా గులాబీ జెండానే ఎగిరింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ లోక్ సభ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు నియోజకవర్గాలలో బీఆర్ఎస్ పార్టీ పాగా వేసింది. ఫలితంగా ఇక్కడ ప్రత్యర్థి పార్టీల కంటే బలంగా ఉందిఅధికారం కోల్పోవటంతో మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ లో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి మారిపోయింది. ఆరు స్థానాల్లో గెలిచినప్పటికీ... ఈసారి ఇక్కడ గెలవటం అతి పెద్ద సవాల్ గా మారింది. ఓవైపు కాంగ్రెస్ అధికార పార్టీగా, మరోవైపు మోదీ మ్యానియాతో బీజేపీ బలమైన ప్రత్యర్థిగా బరిలో ఉన్నాయి. దీంతో ఇక్కడ కూడా బీఆర్ఎస్ తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. ఇక కేసీఆర్ సొంత జిల్లా కావటం కూడా బీఆర్ఎస్

...మిగతాది 2 లో



## అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో భయం.. భయం...

✍ జయభేరి, హైదరాబాద్, మే 9:

పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్ చార్జులుగా ఉన్న కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు సీరియస్‌గా క్యాంపెయిన్ చేస్తున్నారు. ఒకవేళ అనుకున్న ఫలితాలు రాకపోతే అధిష్టానం నుంచి చివాట్లు తప్పవనే ఆందోళన వారిలో కనిపిస్తున్నది. రెండురోజుల క్రితం కేసీ వేణుగోపాల్ ఎన్నికల ప్రచారం తీరుపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అభ్యర్థులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేయడంతో, సదరు లీడర్లలో కదలిక వచ్చినట్టు తెలుస్తున్నది. ఈనెల 10,11 తేదీల్లో ఏఐసీసీ నేతలు రాహుల్, ప్రియాంక గాంధీ రాష్ట్రానికి రానున్నారు. దీంతో వారు పాల్గొనే సభలు,

...మిగతాది 2 లో

## పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలే



✍ జయభేరి, హైదరాబాద్, మే 9:

మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలోని కంటోన్మెంట్, మల్కాజ్ గిరిలో యూత్ మీటింగ్ కు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు కదా? బీఆర్ఎస్ ఎందుకు ఉండాలే అని కొందరు అంటున్నారు. 2001 లో కేసీఆర్ గారు టీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడు పార్లమెంట్ లో మనకు బలం ఉండాలే అన్నారు. అప్పుడు కూడా చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డిలు అవహేళన చేసే విధంగా మాట్లాడారు. 2004 లో మనం ఐదుగురు ఎంపీలు గెలిచినాం. ఆ ఐదుగురితోనే కేసీఆర్ ఢిల్లీకి పోయిండని అన్నారు. 32 పార్టీలను ఒప్పించి, మెప్పించి

...మిగతాది 2 లో

## కేరళలో కొత్త జ్వరం.. 'వెస్ట్ నైల్'

✍ జయభేరి, తిరువనంతపురం, మే 9:



కేరళలో కొత్త జ్వరం 'వెస్ట్ నైల్' కలవర పెడుతోంది. ఈ జ్వరం వల్ల తీవ్ర అస్వస్థతకు గురి కావడమే కాకుండా ప్రాణాపాయం కూడా ఉందని వైద్య అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య అధికారులు ఇప్పటికే అప్రమత్తం చేశారు. ఈ రాష్ట్రంలోని మల్లప్పురం, కోజికోడ్, త్రిసూర్ వెస్ట్ నైల్ కేసులు నమోదైనట్లు వైద్య అధికారులు తెలిపారు. వెస్ట్ నైల్ అనే దోమ వల్ల ఈ వ్యాధి ప్రబలుతుందని, ఈ వ్యాధికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి మందులు లేవని, వ్యాక్సిన్ సైతం ఇంకా గుర్తించలేదని అంటున్నారు. అయతే ఈ జ్వరం లక్షణాలు ఎలా ఉంటాయి? ఇది రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవో చూద్దాం..వెస్ట్ నైల్' అనే జ్వరాన్ని 1937లో ఉగాండాలో కనుగొన్నారు. మనదేశంలో దీని ద్వారా 2019లో ఓ బాలుడు చనిపోవడంతో ఇది వెలుగులోకి వచ్చింది. ప్రతీ మాన్ సూన్ కు ముందుగా ఈ వ్యాధి ప్రబలుతుందని వైద్యులు చెబుతున్నారు. వెస్ట్ నైల్ ఫీవర్ ద్వారా

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రతి మహిళకు ఏడాదికి ₹ లక్ష

నిరుపేదలందరితో ఒక జాబితా రూపొందిస్తామని, రైతులు దళితులు ఆదివాసీలు, మైనార్టీలతో ఒక జాబితా రూపొందిస్తామన్నారు.
ప్రతి పేద కుటుంబం నుంచి ఒక మహిళను ఎంపిక చేసి రూ.లక్ష ఇస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ ఖర్చుల కోసం ప్రతి పేద మహిళ బ్యాంకు ఖాతాలో నెలకు రూ. 8500 చొప్పున.. ఏడాదికి రూ.లక్ష డిపాజిట్ చేస్తామన్నారు రాహుల్. బ్యాంకు ఖాతాల్లో వేసిన డబ్బులతో మహిళలు ఎన్నో వస్తువులు కొనుగోలు చేస్తారని, మహిళల కొనుగోలు శక్తి పెరగటంతో పరిశ్రమల్లో వస్తు ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఉద్యోగా కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని రాహుల్ ప్రజలను కోరారు. నర్సాపూర్ తోపాటు హైదరాబాద్ సరూర్‌గర్ సభలోనూ పాల్గొని ప్రసంగించారు రాహుల్ గాంధీ.

## పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలే

తెలంగాణను సాధించింది కేసీఆర్. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు రాహుల్ గాంధీ, మోడీ ఉస్కో అంటే ఉస్కో, డిస్కో అంటే డిస్కో అంటారు. రాహుల్ గాంధీని, మోడీని ఎదురించే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదు.జూన్ 2 తర్వాత హైదరాబాద్ ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని బీజేపీ కుట్ర చేస్తోంది. స్కైవే కట్టటం కోసం పదేళ్లు మిలిటరీ భూములు ఇవ్వమంటే కంటోన్మెంట్ లో ఇయ్యలే. కేంద్రపాలిత ప్రాంతం అయితే మన జుట్టు తీసుకొనిపోయి ఢిల్లీ వాడి చేతిలో పెట్టినట్లయితది. కేంద్రపాలిత ప్రాంతమైతే హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుంది. ఈ కుట్రను అడ్డుకోవాలంటే కచ్చితంగా బీఆర్ఎస్ ఎంపీలు లోక్ సభలో ఉండాలె. ఢిల్లీలో ఉన్నది బీజేపీ ది సవతి తల్లి లాంటి వ్యవహారం. వాళ్లు మనకు అడగనిదే ఏదీ చేయరు. గల్లా పట్టి నిలదీసే ధైర్యం ఉండాలంటే మన కేసీఆర్ సైనికులు పార్లమెంట్ లో ఉండాలె. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర చేస్తోంది బీజేపీ. అవసరమైతే రాజ్యాంగాన్ని కూడా మార్చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడ ఉంటే అక్కడ బీజేపోళ్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అలకగా పడగొట్టారు. కానీ కేసీఆర్, మమతా బెనర్జీ, హేమంత్ సోరెన్, స్టాలిన్, కేజ్రీవాల్ గారి ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేసి విఫలమైందని అన్నారు. గట్టి లీడర్లు ఉన్న చోట బీజేపీ ఆటలు సాగలేదు. కాంగ్రెస్ కు మాత్రం బీజేపీని అడ్డుకోవటం చేతకాలేదు. మోడీతో కొట్లాడే ధైర్యం రాహుల్ గాంధీకి లేదు. ప్రాంతీయ శక్తులే బలంగా మోడీతో కొట్లాడగలవు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు జనరేటర్లు, ఇన్వెర్టర్లు, క్యాండిల్ లైట్లు, టార్చిలైట్, పవర్ బ్యాంక్, ఛార్జింగ్ బల్బ్ లు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ వస్తే ఈ పరిస్థితి ఉంటది ముందే చెప్పినం. మీరు కాంగ్రెస్ హామీలను నమ్మలేదు. కానీ జిల్లాల్లో, గ్రామాల్లో ప్రజలు ఆ పార్టీ నమ్మారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అని అనుకునేటోళ్లకు ఒక ఉపాయం చెబుతా. మీరు 1012 సీట్లు ఇవ్వండి. 6 నెలల్లోనే కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు. రేవంత్ రెడ్డి చాలా మాటలు చెప్పాడు. అరచేతిలో వైకుంఠం చూపించిండు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, బోనస్, 2 లక్షల ఉద్యోగాలు, తులం బంగారం, స్కూటీలు, మహిళలకు రూ. 2500, పెద్ద మనుషులకు 4 వేలు అని చెప్పిండు. చెప్పిదాంట్లో ఒక్కటైనా ఈ రేవంత్ రెడ్డి అమలు చేసిండా? 5 నెలల్లో రేవంత్ రెడ్డి చేసిందేమిటంటే చిల్లర మాటలు, ఉద్దెర పనులు. లంకె బిందెలు ఉంటాయనుకొని వచ్చినా అంటాడు. లంకెబిందెల కోసం దొంగలు కదా వెతికేది? పేగులు మెడలు వేసుకుంట అంటాడు. జేబుల కత్తెర పెట్టుకుంటా అంటాడు. సీఎం చేసే పనులేనా? మన తెలంగాణ పరిస్థితి పిచ్చోని చేతిలో రాయిలా తయారైంది. కరెంట్, నీళ్లు ఇచ్చుడు చేతనైతలేదు. కానీ విలన్లు చెప్పినట్టు డైలాగులు చెబుతుండు. హైదరాబాద్ లో ఉన్న కంపెనీలను కాపాడుకునే చేతనైతలే. ఇంకా కొత్త కంపెనీలు వచ్చే పరిస్థితే లేదు. పరిపాలన చేతకాని వాళ్లకు అవకాశం ఇస్తే నష్టపోయేది మనమే. పదేళ్లు ప్రధానిగా పనిచేసిన వ్యక్తి హైదరాబాద్ ఒక్క పనిచేసిన అని చెప్పగలడా? ఒక్క బడి కట్టలే, గుడి కట్టలే. ఎందుకు ఓటు వేయాలంటే జై శ్రీరామ్ అంటాడు. 2014 లో ఏమన్నాడు. ఇంటింటికి రూ. 15 లక్షలు అన్నాడు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం డబుల్ చేస్తా అని చెప్పిండు.బుల్లెట్ రైళ్లు, ఇండియాను 5 టిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని కూడా అన్నాడు. ఒక్కటైనా అయ్యిందా? ఈ ప్రధాని మోడీ ధరలు కూడా తగ్గిస్తా అన్నాడు. కానీ పప్పు, ఉప్పు, చింతపండు అన్ని పిరం చేసిండు.పెట్రోల్ ధరలు, డిజీల్ ధరలు పెంచటం కారణంగా ఈ ధరలన్నీపెరిగాయి. మోడీ వచ్చిన నాడు ముడి చమురు వంద డాలర్లకు బ్యారెల్. ఇప్పుడు ముడి చమురు బ్యారెల్ కు 84 డాలర్లు. మరి తగ్గాల్సిన ధరలు ఎందుకు తగ్గలేదు. రూ. 70 పెట్రోల్ రూ. 110 అయ్యింది. పెట్రోల్, డిజీల్ మీద రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా రూ. 30 లక్షల కోట్లు వసూలు చేసిండు. ఈ పైసలతో జాతీయ రహదారులు కట్టినా అంటాడు. మరి టోల్ ఎందుకు వసూల్ చేస్తున్నావంటే చెప్పడు. మన ముక్కుపిండి వసూలు చేసిన రూ. 30 లక్షల కోట్లలో రూ. 14 లక్షల కోట్లు అదానీ, అంబానీలకు రుణమాఫీ చేసిండు. నేను చెప్పింది అబద్ధమని నిరూపిస్తే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి...రాజకీయాల నుంచి తప్పుకుంటా. భారత దేశంలో ఏం జరుగుతుందో మీ యువత తెలుసుకోవాలె.ఇండియాకు ఏదో జరుగుతుందని... హిందూమతమని, పాకిస్తాన్ అంటూ విద్వేషాలు పెంచి రాజకీయాలు చేయటమే బీజేపీ పని. పాలమూరురంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలే. విభజన హామీలు ఒక్కటి కూడా చేయలే. ఎందుకు మనం బీజేపీకి ఓటు వేయాలో ఆలోచించాలె. అడిగితే గుడి కట్టినం అంటారు. గుడిని మనం కూడా కట్టినం. కేసీఆర్ గారు యాదాద్రిని కట్టలేదా? కానీ మతం పేరుతో ఎప్పుడైనా రాజకీయాలు చేశారా? రాముడు కూడా రాజధర్మం పాటించమని చెప్పాడు. పరిపాలకుడు ఎవరినైనా ఒకే విధంగా చూడాలి. కానీ హైదరాబాద్ కు వరదలు వస్తే రూపాయ్ ఇయ్యాడు మోడీ. అదే గుజరాత్ కు వరదలు వస్తే వెయ్యి కోట్లు ఇస్తాడు. ఇదే నా రాజధర్మం? దయచేసి లాంగ్ వీకెండ్ ఉందని యువత ఓటు వేయకుండా ఉండొద్దు. మీరు ఓటు వేయకపోతే మీకు ఇష్టం లేని లంగ, దొంగ నాయకులు రాజ్యమేలుతారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు నాన్ లోకల్. రాగిడి లక్ష్మారెడ్డి గారు మాత్రం మీకు ఎప్పుడు అందుబాటులో ఉంటారు. రాగిడి లక్ష్మారెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించాలని మీ అందరినీ కోరుతున్నానని అన్నారు.

## అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో భయం.. భయం...

రోడ్డుషోల విజయవంతానికి ప్రత్యేక దృష్టిపెట్టారు.లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపోటములు మంత్రులు, ఎమ్మెల్యేలకు చాలెంజ్‌గా మారాయి. ఇన్ చార్జులుగా ఉన్న స్థానాల్లో అభ్యర్థులు గెలిస్తే పదవులు దక్కుతాయని, ఓడితే ఉన్న పదవులు ఊడుతాయనే సంకేతాలను అధిష్టానం ఇచ్చినట్టు చర్చ జరుగుతున్నది. ఈ విషయాన్ని గ్రహించిన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ సొంత ఎన్నికల కంటే ఎక్కువ సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.ప్రధానంగా గట్టి పోటీ ఉన్న సెగ్మెంట్లలో పార్టీ అభ్యర్థి విజయం కోసం పలు రకాలు వ్యూహాలను అమలు చేసేందుకు రెడీ అయ్యారు. ఇప్పటివరకు ఎన్నికల ప్రచారం చేయని ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల్లో పర్యటించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అలాగే పోల్ మేనేజ్మెంట్‌పై కూడా దృష్టి పెట్టినట్టు తెలుస్తున్నది. ఏ విధంగా పోల్ మేనేజ్మంట్ చేయాలో తమ కేడర్‌కు ఇప్పటికే దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్రానికి రాహుల్, ప్రియాంక రానున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సభలు, రోడ్డు షోల సక్సెస్ కోసం ప్లాన్ చేస్తున్నారు.తమ సొంత నియోజకవర్గాల్లో ఓటింగ్‌పై మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కువ ఫోకస్ పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమకు వచ్చిన ఓట్ల కంటే లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు రాబట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఒకవేళ తక్కువ ఓట్లు వస్తే, హైకమాండ్ నుంచి చివాట్లు తప్పవనే ఆందోళన వారిలో కనిపిస్తున్నది. అందుకని నియోజకవర్గంలోని పలు వర్గాలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల ఓట్లు రాబట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలోని మైనార్టీ ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు కాంగ్రెస్ లీడర్లు ప్రయత్నాలు చేస్తున్నారు.ఎన్నికల ప్రచారంలో మంత్రులు, ఎమ్మెల్యేల కదలికలపై కాంగ్రెస్ అధిష్టానం ఎప్పటికప్పుడు రిపోర్టులు తెప్పించుకుంటున్నది. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికలను సీరియస్ గా తీసుకోవడం లేదని ఫిర్యాదులు వెళ్లాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్ సీరియస్‌గా క్లాస్ తీసుకున్నట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం ఉంది. పోలింగ్ ముగిసేవరకు లీడర్ల ప్రచారం, పోల్ మేనేజ్మెంట్‌పై కూడా అధిష్టానం ఫోకస్ పెట్టినట్టు తెలుస్తున్నది.

# అదిలాబాద్ లో సిట్టింగ్ నిలబడేనా



✍ జయభేరి, అదిలాబాద్, మే 9:

ఆదిలాబాద్ ఎంపి సీటు మూడు పార్టీలకు అగ్ని పరీక్షగానే మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు బీజేపీ, రెండు బీఆర్ఎస్, ఒక సీటును కాంగ్రెస్‌ను గెలుచుకుంది. ఇలా మిశ్రమ ఫలితాలు వచ్చిన నేపథ్యంలోగెలుపు లెక్కలు పక్కనపెడితే ఏడు నియోజకవర్గాల్లోకలిపి మెజార్టీని మాత్రం అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీనే సాధించింది. కేవలం బోథ్ , ఆసిఫాబాద్ నియోజకవర్గాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ 46,5476 ఓట్లను సాధించుకుని అగ్ర భాగాన నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు కలిపి 15,17,681 ఓట్లకుగాను 13,07,563 ఓట్లు పోలవగా.. ఏకంగా నాలుగు స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ మొత్తం ఓట్లలో 4,48,961 ఓట్లను తన ఖాతాలో వేసుకుంది. ఇక కేవలం ఒకే ఒక్క ఎమ్మెల్యే స్థానంతో సరిపెట్టుకున్న కాంగ్రెస్ పార్లమెంట్ పరిధిలో 2,52,286 ఓట్లను కైవసం చేసుకుని మూడవ స్థానానికి పరిమితం అయింది. అయితే మారిన రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్ నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లోకి చేరికలు సాగడంతో క్యాడర్ బలం, బలగం పెరిగి గంప గుత్తగా ఓటు బ్యాంకును కైవసం చేసుకోగలిగింది హస్తం పార్టీ. అయితే బలం పెరిగినా అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రం ప్రతికూల ఫలితాలు కనిపిస్తున్నట్టుగా తెలుస్తోంది. దీంతో ఇంట గెలిచి రచ్చ గెలవాల్సిన పరిస్థితి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ఎదురవుతోంది.రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ కావడం పార్లమెంట్ పరిధిలోనే ఏకైక అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే నియోజక వర్గం కూడా ఖానాపూర్ కావడంతో ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న వెడ్మ బొజ్జుపై భారం ఎక్కువగానే ఉన్నట్టు తెలుస్తోంది. ఇక్కడ అసెంబ్లీ ఎన్నికల్లో మూడు పార్టీలు నువ్వా నేనా అన్నట్టుగా తలపడగా.. కాంగ్రెస్ 58,870 ఓట్ల సాధించి.. ప్రత్యర్థి పార్టీ బీఆర్ఎస్‌పై 4,702 ఓట్ల తేడాతో విజయం సాధించింది. తాజా పార్లమెంట్ ఎన్నికల్లో ఆ మెజార్టీ కాంగ్రెస్ ఖాతాలోనే ఉంటుందా లేక పక్క పార్టీకి వెలుతుందా అన్న టెన్షన్ ఎమ్మెల్యే వర్గంలో ఉంది. ఈ నియోజకవర్గంలో ఆపరేషన్ ఆకర్ష్ పెద్ద ఎత్తున కొనసాగగా.. బీజేపీ సైతం ఈ నియోజక వర్గంపై ప్రత్యేక ఫోకస్ పెట్టడంతో ఖానాపూర్‌లో మెజార్టీని పునరావృతం చేసేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తీవ్రంగానే శ్రమించక తప్పడం లేదు. అయితే పార్లమెంట్ పరిధిలో గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కావడంతో మిగిలిన నియోజక వర్గాల్లోను ప్రచారం చేయాల్సి రావడంతో సొంత నియోజకవర్గానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోవడంతో ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయని తెలుస్తోంది.ఇక ఇద్దరు ఎమ్మెల్యేలను గెలుచుకున్న బీఆర్ఎస్.. ఇటు హస్తం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌తో లీడర్లను కాపాడుకోవడంతో పాటు.. అటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం కత్తిమీద సాములా మారింది. ఆదివాసీ నియోజకవర్గాలైన ఆసిఫాబాద్, బోథ్‌లో బీఆర్ఎస్ విజయం సాధించినా.. ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ జెట్ స్పీడ్‌తో పుంజుకోవడం.. ఇటు బోథ్‌లో బీజేపీ చాపకింద నీరులా విస్తరించడంతో రెండు నియోజకవర్గాల్లో ప్రతికూల ఫలితాలనే ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. బోథ్‌లో కోవ లక్ష్మి 83,036 ఓట్లను సాధించి 22,798 వేల భారీ ఆధిక్యంతో కాంగ్రెస్‌పై విజయం సాధించగా.. ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాలతో కీలక నేతలు పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరడం మైనస్‌గానే మారింది. అయితే బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థి సొంత నియోజక వర్గం కావడం.. ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై పాజిటివ్ టాక్‌తో బీఆర్ఎస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ మెజార్టీని కాపాడుకునే అవకాశమే ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇటు బోథ్‌లోను బీఆర్ఎస్ గెలుపొందగా.. మారిన రాజకీయ పరిణామాలతో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ తన మెజార్టీని పార్లమెంట్ ఎన్నికల్లోను కంటిన్యూ చేసేందుకు తీవ్రంగా చెమటోడ్చక తప్పని పరిస్థితే ఉన్నట్టుగా తెలుస్తోంది. అనిల్ జాదవ్ 76,792 ఓట్లు సాధించి సమీప అభ్యర్థి సోయం బాపురావు బీజేపీపై 22,800 ఓట్ల మెజర్టీని సాదించగా.. తాజా పార్లమెంట్ ఎన్నికల్లో ఈ మెజార్టీని కాపాడుకోవడం కత్తి మీద సాములాగే మారిందని తెలుస్తోంది. ఈ నియోజక వర్గంపై ప్రత్యేక ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ , బీజేపీలు పోటాపోటీ ఆపరేషన్ ఆకర్ష్‌తో బీఆర్ఎస్‌కు గడ్డుకాలం ఎదురవగా.. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాత్రం తీవ్రంగా శ్రమిస్తుండటం కలిసొచ్చే అంశం.అటు నాలుగు స్థానాలను గెలుచుకున్న బీజేపీ.. పార్లమెంట్ సిట్టింగ్ సీటును కాపాడుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి నిలవాలని విశ్వ ప్రయత్నాలే చేస్తోంది. అయితే ఇంట గెలిచి రచ్చ గెలవాల్సిన పరిస్థితులు బీజేపీ ఎమ్మెల్యే లకే ఎక్కువగా ఉన్నట్టుగా తెలుస్తోంది. బారీ మెజార్టీతో విజయం సాదించిన నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి బీజెఎల్పీగా కొనసాగుతుండటంతో ఈ పార్లమెంట్‌లో బీజేపీ గెలుపు బాధ్యతలు అదనపు భారం మహేశ్వర్ రెడ్డి మోయక తప్పడం లేదు. ఈ నియోజక వర్గంలో 10,6400 ఓట్లు సాధించి ఏకంగా 50,703 ఓట్లతో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి (బీఆర్ఎస్ ) మట్టికరిపించడం బీజేపీకి బూస్ట్ నిచ్చింది. తాజా పార్లమెంట్ ఎన్నికలను టార్గెట్‌గా తీసుకున్న కాంగ్రెస్ నిర్మల్ జిల్లా మీద ప్రత్యేకఫోకస్ పెట్టగా.. నిర్మల్‌ను కాంగ్రెస్‌కు అడ్డాగా మార్చేందుకు భారీ ఆపరేషన్ ఆకర్ష్‌ను కంటిన్యూ చేస్తోంది కాంగ్రెస్. అందులో భాగంగానే మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని పార్టీలోకి చేర్చుకోవడంతో బీఆర్ఎస్‌కు ఈ నియోజకవర్గంలో పెద్ద షాక్ తగిలినట్టైంది. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ సాధించిన 55,697 ఓట్లలోసగానికిపైగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పడే అవకాశమే ఉన్నట్టుగా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 28,642 ఓట్లను సాధించుకోగలిగిన కాంగ్రెస్.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా పుంజుకుని బీజేపీకి సవాల్ విసిరే అవకాశం ఉంది. అయితే నిర్మల్ నియోజవర్గంలో బీజేపీ వైపు ఇక్కడి ప్రజానికం నిలవనుండటంతో మహేశ్వర్ రెడ్డి ఇంట గెలిచి రచ్చ గెలిచేందుకు పక్కా వ్యూహాలతో ముందుకు దూసుకెళుతున్నట్టుగానే తెలుస్తోంది.ఇక ఆదిలాబాద్‌ను కాషాయ అడ్డాగా మార్చుకున్న బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే స్థాయి ఫలితాలను పునరావృతం చేయాలని చూస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపినా.. అదే స్థాయిలో అసమ్మతి నివురు గప్పిన నిప్పులా సాగుతుండటంతో కలిసొచ్చే కాలానికి నడిచి రాని మెజార్టీగానే ఈ నియోజకవర్గం కనిపిస్తోంది. ఈ నియోజక వర్గంలో బీజేపీ 67,608 ఓట్లను సాధించడంతో పాయల్ శంకర్ తొలిసారిగా అధ్యక్షా అనే అవకాశం దక్కించుకోగా.. రాజకీయ చతురతతో సిట్టింగ్ ఎంపిని కాదని బీజేపీ అభ్యర్థిగా గోడెం నగేష్‌కు ఎంపి టికెట్ దక్కడంలో చక్రం తిప్పారన్న పేరుంది.
దీంతో పార్లమెంట్ పరిధిలోని మిగిలిన నియోజకవర్గాల్లోను తన బలం పెంచుకోవాలని పాయల్ ప్రయత్నిస్తుంటే.. వర్గపోరు ఆయనను వెనక్కి లాగుతున్నట్టు తెలుస్తోంది. దీంతో మొదట ఇంట గెలవాల్సిన పరిస్థితి పాయల్ శంకర్‌కు అత్యవసరంగా మారినట్టు తెలుస్తోంది. ఇప్పటికైతే బీజేపీ అనుబంధ సంఘాల బలం కలిసొచ్చే అంశంగానే కనిపిస్తోంది. కానీ బీఆర్ఎస్ ఈ నియోజక వర్గంలో బలపడినా.. ఆపరేషన్ ఆకర్ష్ ఫలితం కాంగ్రెస్‌కు దక్కినా బీజేపీకి అసెంబ్లీ తరహా మెజార్టీ దక్కడం కష్టమే అన్న టాక్ కూడా లేకపోలేదు.ఇక సిర్పూర్ , ముధోల్ నియోజక వర్గాలు సైతం బీజేపీకి కంచుకోటగా మారగా.. ఈ రెండు నియోజక వర్గాల ఎమ్మెల్యేలకు మెజార్టీని కాపాడుకోవడం కత్తి మీద సాములాగే మారింది. ముధోల్‌లో బీజేపీకి ఇప్పటికిప్పుడు వచ్చిన డోకా ఏం లేదన్న ప్రచారం ఉన్నా.. అధికార పార్టీ మాత్రం ఆపరేషన్ ఆకర్ష్‌తో అన్నంత పని చేసేందుకు సిద్ధమవడం కూడా ముధోల్‌లో ఎమ్మెల్యే రామరావు పటేల్‌కు కష్టకాలంగానే మారిందని తెలుస్తోంది.
గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 98,252 ఓట్లతో 23,999 ఓట్ల తేడాతో భారీ విజయాన్ని దక్కించుకున్న బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లోను ఆ మెజార్టీని దక్కించుకుంటుందా లేదా చూడాలి. ఇక సిర్పూర్‌లోను అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగగా.. మారిన రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో ఇక్కడ బీఆర్ఎస్ ఖాళీ అయింది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లోకి చేరడంతో హస్తం పార్టీ రెట్టింపు ఉత్సహంతో కనిపిస్తుండగా.. బీజేపీ సంప్రదాయ ఓటును నమ్ముకుని సాగుతోంది. ఇక్కడ బీజేపీ 63,702 ఓట్లను సాధించి సమీప అభ్యర్థి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోనేరుకోనప్పపై కేవలం 3,088 ఓట్లతో గట్టెక్కగా.. తాజా పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలంటే సిర్పూర్‌లో మెజార్టీ కీలకం కావడంతో ఇంట గెలవాల్సిన అత్యవసర పరిస్థితి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ముందుంది. ఆదిలాబాద్ పార్లమెంట్ సీటును ఏ పార్టీ సాదించినా సొంత నియోజకవర్గంలో మెజార్టీని మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యేలు సాధించక తప్పని పరిస్థితి. సో.. అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీని సాధించుకున్న తీరుగానే.. నాలుగు రోజుల్లో రానున్న ఓట్ల పండుగలో తిరిగిసత్తా చాటి.. తమ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తారో.. లేక ప్రతికూల పరిస్థితులతో వెనకబడిపోతారో చూడాలి.

లను కాపాడిన జగమొండి నా మోదీ. మూతపడ్డ రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని 6 వేల కోట్లకుపైగా వెచ్చించి తెరిపించిన జగమొండి నా నరేంద్ర మోదీ. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేసిన జగమొండి నా మోదీ. నరేంద్ర మోదీ 'మేడ్ ఇన్ భారత్'... మరి సోనియా మైనో, రౌల్ విన్సీ ఎవరు? ...మేడ్ ఇన్ ఇటలీ. మా భారతీయ జనతా పార్టీ మేడ్ ఇన్ ఇండియా... మీ కాంగ్రెస్ పార్టీ ఎక్కడిది మేడ్ ఇన్ బ్రిటీష్. నా మోదీ పక్కా లోకల్. మరి సోనియా ఎక్కడి నుండి వచ్చిందో కాంగ్రెస్ చెప్పాలే. పక్కా లోకల్ మోడీ కావాలా? నాన్ లోకల్ రాహుల్ విన్సీ, సోనియా మైనో కావాల్నా. మేడ్ ఇన్ భారత్ పార్టీ కావాల్నా?? మేడ్ ఇన్ బ్రిటన్ పార్టీ కావాలా. 6 గ్యారంటీలను అడిగితే కాంగ్రెస్ నేతలు గాడిద గుడ్డు ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే పెద్ద గాడిద గుడ్డు. 6 గ్యారంటీల అమలును చేయమంటే ఇచ్చింది గాడిద గుడ్డు. 2లక్షల రైతు రుణమాఫీ చేయాలని అడిగితే ఇచ్చింది గాడిద గుడ్డు. వరికి రూ.500ల బోనస్, తాలు, తరుగుతో పనిలేకుండా వడ్లు కొనమని అడిగితే మన చేతికి ఇచ్చింది గాడిద గుడ్డు. రైతులు, కౌలు రైతులకు 15వేలు, రైతు కూలీలకు 12 వేలు అడిగితే ఇచ్చింది గాడిద గుడ్డు. విద్యార్థులకు రూ.5లక్షల కార్డు అడిగితే ఇచ్చింది గాడిద గుడ్డు. వృద్ధులకు, నిరుద్యోగ భ్రుతి రూ.4 వేల పెన్షన్ అడిగితే ఇచ్చింది గాడిద గుడ్డు. మహిళలకు 2,500లు అడిగితే ఇచ్చింది గాడిద గుడ్డు. అసలు కాంగ్రెస్ మ్యానిఫెస్టోనే పెద్ద గాడిద గుడ్డు. ఆ పార్టీ గుర్తు హస్తం కాదు... గాడిద గుడ్డు మాత్రమే. అరడుగుల బుల్లెట్ మన నరేంద్ర మోడీ. ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్ చోర్ బ్యాచ్. అరడుగుల బుల్లెట్ మోదీ కావాలా?? లేక చోర్ బ్యాచ్ కాంగ్రెస్ కావాలా? మోదీ ఏ పని చేపట్టినా వాళ్ల అమ్మ ఆశీస్సులు తీసుకుని బయటకువస్తారు. ఇప్పుడు వారికి అమ్మ లేరు. మనమంతా మోదీ పక్షాన ఉంటూ ముచ్చటగా మూడోసారి ప్రధానిని చేసుకుందామని అన్నారు.

## సౌత్ వాళ్లు..ఆఫ్రికన్స్ లా ఉంటారు

పత్రికకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన శాం పిట్రోడా.. భారతదేశం చాలా భిన్నమైన దేశమని పేర్కొన్నారు. అలాగే మన దేశం విభిన్న సంస్కృతులకు నిదర్శనం అని తెలిపారు. తూర్పు ప్రజలు చైనీయుల్లా.. పశ్చిమాన ఉన్న ప్రజలు అరబ్బులుగా కనిపిస్తారని, ఇక ఉత్తరాది ప్రజలు శ్వేతజాతీయులుగా.. దక్షిణాది ప్రజలు ఆఫ్రికన్‌లుగా కనిపిస్తారని చెప్పారు. ఇవన్నీ ఎలా ఉన్నప్పటికీ.. మనమందరం సోదరులు సోదరీమణులమని, ప్రతీ ఒక్కరి భాష, ఆహారపు అలవాట్లు, సంప్రదాయాలు, సంస్కృతిని పరస్పరం గౌరవించుకుంటామని ఆయన అన్నారు.మరోవైపు శాం పిట్రోడా వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. భారతీయుల రూపురేఖల ఆధారంగా ఆయన పోల్చిన తీరు జాతి వివక్షేనని ధ్వజమెత్తింది. విభజించిపాలించు అనేది కాంగ్రెస్ సిద్ధాంతమని బీజేపీ నేతలు మండిపడ్డారు. అయితే తాజాగా ఈ విమర్శలపై కాంగ్రెస్ స్పందించింది. అవన్నీ కూడా శాం పిట్రోడా వ్యక్తిగత అభిప్రాయమంటూ వివరణ ఇచ్చింది.

# ఎన్నికల పనుల్లో చేతి వాటం

✍ జయభేరి, హైదరాబాద్, మే 9:

ఎలక్షన్స్ వచ్చాయంటే చాలు వారికి ఫుల్ హ్యాపీ.... వాస్తవానికి వారు జీహెచ్ఎంసీలో పనులు చేయించాల్సిన ఇంజినీర్లు. కానీ ఎన్నికలొచ్చాయంటే చాలు వారు కాంట్రాక్టర్లుగా మారిపోతారు. అడపాదడపా పనులు చేయించే లైసెన్స్ కలిగిన కాంట్రాక్టర్లను బినామీలుగా పెట్టుకుని పబ్బం గడుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఎన్నికలకు సంబంధించి లైటింగ్, వీడియో, డీఆర్సీ సెంటర్లు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులు, స్ట్రాంగ్ రూమ్‌ల నిర్మాణం, డీఆర్సీ సెంటర్లలోని సిబ్బందికి భోజనాలు వంటి పనులను కొటేషన్లు, షార్ట్ టెండర్ల ప్రక్రియలతో కేటాయించాలని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే జిల్లా ఎన్నికల అధికారి లిఖితపూర్వకమైన ఆదేశాలు జారీ చేసినా క్షేత్ర స్థాయిలో అవి ఏమాత్రం అమలు కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి అడ్డదారిలో ఎలక్షన్స్ పనులు చేజిక్కించుకుని తమ బినామీ కాంట్రాక్టర్లకు కట్టబెడుతూ జీహెచ్ఎంసీ ఇంజినీర్లు, అధికారులు అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలతో పాటు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఏ పనికైనా టెండర్ల ప్రక్రియ చేపట్టి, అందులో తక్కువగా కోడ్ చేసిన కాంట్రాక్టర్‌కు గానీ, సంస్థకు గానీ పనులు కేటాయించాల్సి ఉంది. మరీ అర్జెంట్ అయితే కనీసం కొటేషన్లను తీసుకోనైనా, లేక షార్ట్ టెండర్ల ప్రక్రియను నిర్వహించైనా పనులు చేపట్టాలని నిబంధనలు చెబుతుంటే జీహెచ్ఎంసీ ఇంజినీర్లు మాత్రం పనులను నామినేషన్ పద్ధతిని కట్టబెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే జిల్లా ఎన్నికల అధికారి లిఖితపూర్వకమైన ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ జోన్‌లోని నాంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూం నిర్మాణ పనులను ఓ ఇంజనీర్ చేజిక్కించుకుని తన ఇద్దరు బినామీ కాంట్రాక్టర్లతో పనులు చేయించిన విషయం ఇటీవలే బయటపడినా కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోలేదన్న విషయం చర్చనీయాంశంగా మారింది.ఇప్పుడు కూడా పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మాసాబ్ ట్యాంక్ సాంకేతిక భవన్‌లో నిర్మించిన నాంపల్లి నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్ నిర్మాణ పనులు సదరు ఇంజినీరే చేజిక్కించుకున్నట్లు చర్చ జరుగుతుంది. పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి చెందిన ఆఫీసర్ నిజాంకాలేజీలో ఏర్పాటు చేసిన డీఆర్సీ సెంటర్‌లోని స్టాఫ్‌కు టీ, టిఫిన్, భోజనాలకు సంబంధించిన కాంట్రాక్టును చేజిక్కించుకున్నట్లు సమాచారం. సదరు ఆఫీసర్ ఆ టీ, టిఫిన్, భోనాలను నిజాం కాలేజీ క్యాంటీన్ నుంచే సమకూర్చి భారీగా అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇదే రకంగా ఖైరతాబాద్ జోన్‌లో మరో ఇంజినీర్, ఉప్పల్‌లో ఓ ఇంజినీర్ పనులు చేజిక్కించుకున్నట్లు సమాచారం. ఎలక్షన్ పనులను నిబంధనలు ఉల్లంఘించి నామినేషన్ పద్ధతిన కేటాయిస్తున్నా, ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నాంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్ నిర్మాణ పనులు ఖైరతాబాద్ జోన్‌లోని మెహిదీపట్నంకు చెందిన ఇంజినీర్ చేపట్టిన విషయం ఇటీవలే బట్టబయలైన, కమిషనర్ గానీ, జిల్లా ఎన్నికల అధికారి గానీ, ఇంజనీర్ ఇన్ చీఫ్ గానీ ఎందుకు చర్యలు చేపట్టలేదన్న విషయం హాట్ టాపిక్‌గా మారింది. అడ్డదారిలో పనులు చేజిక్కించుకుంటున్న ఇంజనీర్లు కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ఎవరి వాటాలు వారికి అప్పగించటమే వారిపై చర్యలు తీసుకోక పోవడానికి ప్రధాన కారణమా? అంటూ జీహెచ్ఎంసీ సిబ్బంది చర్చించుకోవడం కనిపించింది.

# ఫుల్ జోష్ లో గులాబీ దళం ప్రచారం

- ఉప్పల్, కాప్రా డివిజన్ లో విస్తృత ప్రచారం
- తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని సర్వేలలో టాప్ లోకి BRS
- సాయిబాబా నగర్ కాప్రా, శ్రీ పోచమ్మ దేవాలయం లో ప్రత్యేక పూజలు

**జయభేరి, కాప్రా :**



మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. గురువారం ఉప్పల్ నియోజకవర్గం లోని కాప్రా డివిజన్, సాయిబాబా నగర్ నుండి భారీ ర్యాలీ పాదయాత్ర ప్రారంభం. A.S.రావు నగర్, చక్రిపురం వరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇంచార్జి మహమ్మద్ జహంగీర్ పాషా. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు 1వ వార్డు BRS పార్టీ శ్రేణులతో కలిసి వార్డు లోని ప్రతి ఇంటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని, డోర్ స్టిక్కర్స్ వేస్తూ



కర పత్రాలు పంచుతూ ఇంటింటికి తిరిగి ప్రచారం చేయడం జరిగింది. కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం ఐదు నెలల్లోనే 10 యేండ్లు వెనుకకు నెట్టి వేయబడ్డదని, మళ్ళీ పునర్నిర్మాణం జరగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి ప్రశ్నించే గొంతుకను చట్ట సభల్లో నిలపాలన్నారు.కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలతో మాయ మాటలు చెప్పి అధికారం లోకి వచ్చిన తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు కాంగ్రెస్ చేతిలో బంధీ అయ్యిందన్నారు ఎక్కడికి వెళ్లినా బీఆర్ఎస్ కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో.. కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమ శేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు డివిజన్ అధ్యక్షులు సుడుగు మహేందర్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, గిరి బాబు, సీనియర్ నాయకులు నవీన్ గౌడ్, మహేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు, ఉద్యమకారులు, మహిళ సోదరీమణులు, యువత కార్యకర్తలు, మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## మస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం

**జయభేరి, బోయినపల్లి :**

ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్. ఓల్డ్ బోయినపల్లి డివిజన్ ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్ పల్లి నియోజకవర్గంలో ఓల్డ్ బోయినపల్లి డివిజన్ 119లో ముద్దం నర్సింహా యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ముస్లిం మైనారిటీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## పోలీసులు వాహనాల తనిఖీలు

- అక్రమంగా మద్యం తరలిస్తున్న కార్, మద్యం బాటిళ్లను సీజ్ చేసిన పోలీసులు... ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

**జయభేరి, మే 9 :**

ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, డబ్బు రవాణా పై ప్రత్యేక దృష్టి పెట్టారు పోలీసులు. ఇందులో భాగంగా మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపల్ పరిధిలోని మందాయి పల్లి క్రాస్ రోడ్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. కాగా Ts 07 EE 2213 నంబర్ గల కార్ ని ఆపి తనిఖీ నిర్వహించగా అందులో సుమారు 64 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా కారులో ఉన్న అల్లంకి సుమన్ గౌడ్, పుదారి రమేష్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా ఎన్నికల సందర్భంగా ముందు జాగ్రత్తగా తుంకుంట లోని మారుతి వైన్స్ నుండి మద్యాన్ని విక్రయించినట్లు తెలిపారు. అయితే మోతాదుకు మించి మద్యం తరలించగా అదే విధంగా ఎలాంటి అనుమతులు, లైసెన్స్ లేకపోవడంతో మద్యాన్ని సీజ్ చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

## బీఆర్ఎస్ గట్టి షాక్ లు ఇస్తున్న నేతలు

- మూడు చింతల పల్లి మండలం లక్ష్మాపూర్ లో కాంగ్రెస్ గూటికి చేరిన నేతలు
- అభివృద్ధి ని చూసి పార్టీలో చేరుతున్నారు : వైస్ ఎంపీపీ మంద శ్రీనివాసరెడ్డి



**జయభేరి, మే 9 :**

ఎన్నికలు సమీపిస్తున్న వేళా కారు పార్టీకి భారీగా షాక్ లు తగులుతున్నాయి. తాజాగా మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కటికెల గోపి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో తమకు ఆదరణ తగ్గిందని, కాగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఆ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్ గిరి నుండి పోటీ చేస్తున్న పట్నం సునీత మహేందర్ రెడ్డి ని భారీ మెజార్టీ తో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మూడు చింతల పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మల పల్లి నర్సింలు యాదవ్, వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి, మండల సీనియర్ నాయకుడు బండి జగన్నాథం, కీసరి నర్సింలు, విరేశం గుప్త, బండి రవి, కొమ్ము లక్ష్మణ్, కీసరి వెంకటేష్, సింగం భాస్కర్, కవాడి రవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార జోరు పెంచిన బీజేపీ పార్టీ

- అలియబాద్ లో ఇంటింటి ప్రచారం చేసిన బిజెవైఎం నేతలు
- మల్కాజిగిరి సీటు బీజేపీ దే - బిజెవైఎం మండల అధ్యక్షుడు గుదే శరత్ కుమార్




**జయభేరి, మే 9:**

ఎన్నికల ప్రచారానికి సమయం దగ్గర పడుతున్న కొలది ఆయా పార్టీల నేతలు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇక మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం అలియబాద్ గ్రామంలో బిజెవైఎం మండల అధ్యక్షుడు గుదే శరత్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఇంటింటి కి వెళ్లి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోడీ దేశ అభ్యున్నతికి ఎంతో పాటు పడుతున్నారని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక గూటికి చెందిన వారే అని, వారికి ఓటేస్తే ఫలితం శూన్యం అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్ గిరి నుండి పోటీలో ఉన్న ఈటెల రాజేందర్ ను భారీ మెజార్టీతో గెలిపించి ప్రతిపక్ష పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కొంగ బాలకృష్ణ, బూత్ అధ్యక్షుడు సంతోష్, బ్రహ్మానంద రెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**జయభేరి, నల్గొండ :**

దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ని గెలిపించాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కోరారు. గురువారం దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామంలో ప్రచారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎన్నికల ఇంచార్జ్ రేగట్టి మల్లికార్జున్ రెడ్డి దేవరకొండ మండల టిఆర్ఎస్ అధ్యక్షులు TV N REDDY, దేవరకొండ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్ గౌ,డ్ రేణు గౌడ్, బిఆర్ఎస్ ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

- బిఆర్ఎస్ యువజన విభాగ రాష్ట్ర నాయకులు బాదేపల్లి పులి రాజు గౌడ్



**జయభేరి, చింతపల్లి :**

మాల్ (వెంకటేశ్వర నగర్ )గ్రామంలో బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలంటూ ఇంటింటా ప్రచారం. బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలిపించాలని కోరుతూ బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తూ కరెంటు కోతలు ఈ మూడు నెలల్లో ప్రజలు పడుతున్న కష్టాలు పోవాలంటే కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని వారు పిలుపునిచ్చా.రు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువజన విభాగ రాష్ట్ర నాయకులు బాదేపల్లి పులి రాజు గౌడ్, ఆకుతోట నరసింహ, కంకణాల రాజు, రామకృష్ణ, జిట్ట జగన్, మల్లోజు గోపి, కాశగోని యాదయ్య, కే లక్ష్మణ్, బీరెల్లి మహేందర్, నవాబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# అక్షయ తృతీయ పర్ణ మహోత్సవం




108 మంది జైనులు తమ ఏడాది నిరాహార దీక్షను విరమించిన సందర్భంగా.. కుశాల్ దాదా వాడి జైన దేవాలయంలో రెండు రోజుల అక్షయ తృతీయ పర్ణ మహోత్సవంలో నగర జైనుల ఓటింగ్ అవగాహన

- 108 మంది జైనులు తమ ఏడాది నిరాహార దీక్షను విరమిస్తున్న సందర్భంగా కుశాల్ దాదా వాడి జైన దేవాలయంలో రెండు రోజుల అక్షయ తృతీయ పర్ణ మహోత్సవంలో నగర జైనుల ఓటింగ్ అవగాహన కార్యక్రమం చేశారు.
- భారతదేశం అంతటి నుండి 108 జైనులు, హైదరాబాద్‌కు చెందిన 32 మందితో సహా శుక్రవారం చెరుకు రసం సేవించడం ద్వారా తమ ఏడాది ఉపవాసాన్ని విరమించుకుంటారు.

**జయభేరి, హైదరాబాద్, మే 09:**

నగరంలోని కార్వాన్ లోని దాదా వాడి జైన్ దేవాలయం లో శుక్రవారం జరగనున్న అక్షయ తృతీయ పర్ణ మహోత్సవ్ అనే రెండు రోజుల కార్యక్రమంలో ఏడాది కలం పాటి ఉపవాస దీక్షను ముగించేందుకు 108 మంది జైనులు భారతదేశ వ్యాప్తంగా చేరుకున్నారు. ఈ రెండు రోజుల కార్యక్రమం జైన దేవాలయం, కార్వాన్ అక్షయ తృతీయ పర్ణ మహోత్సవం ప్రారంభమైంది. శుక్రవారం నాడు 108 మంది జైనులు తమ ఏడాది నిరాహార దీక్షను విరమిస్తున్న సందర్భంగా కుశాల్ దాదా వాడి జైన దేవాలయంలో రెండు రోజుల అక్షయ తృతీయ పర్ణ మహోత్సవంలో నగర జైనులు మహిళలు మరియు పురుషులు కలిసి గురువారం ఓటింగ్ పై అవగాహన కల్పించారు. జైన గురువు డాక్టర్ సంకిత్ ముని జీ, మరో ఇద్దరు జైన సన్యాసుల మార్గదర్శకత్వం




లో అక్షయ తృతీయ పర్ణ మహోత్సవ్ నిర్వహించబడుతోంది. ఈ రోజున భారతదేశం అంతటా నాసిక్, పూణే, జోధ్‌పూర్, కర్ణాటక, చెన్నై వంటి 700 మంది జైనులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. హైద్రాబాద్ కు చెందిన 32 మంది కూడా ఇందులో పాల్గొంటారు. ఆర్గనైజింగ్ బాడీ ఆఫీస్ బేరర్లు స్వరూప్‌చంద్ కొఠారి, గౌతమ్ చంద్ డాంక్, సజ్జన్ గాంధీ, అన్నరాజ్ బఫ్నా, వినోద్ కిష్టీలు నగరంలో విడుదలచేసిన ఒక పత్రికా ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. చెరుకు రసంతో 108 మంది జైనులు తమ ఏడాదిపాటు దినం తప్పించి దినం చేసిన ఉపవాసాన్ని ముగించనున్నారు. దీని కోసం ఆవరణలో పెద్ద సంఖ్యలో చెరుకు రసం బండిలను ఏర్పాటు చేయనున్నారు. నిరాహార దీక్ష విరమించే ముందు శుక్రవారం ఉదయం 9 గంటలకు గుడి మల్కాపూర్‌లోని సాయిబాబా ఆలయం నుంచి దాదావాడి జైన దేవాలయం కారవాన్ వరకు కిలోమీటరు మేర ఊరేగింపుగా వెళ్లనున్నారు. ఊరేగింపులో 20 రథాలు పాల్గొంటాయి. ఈ రోజు ప్రారంభమై రేపు ముగిసే ఈ మహోత్సవంలో దాదాపు 4000 మంది పాల్గొంటారని అంచనా. గురువారం దాదా వాడి జైన దేవాలయంలో భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి కళా కుశాల్ భవన్‌కు చేరుకున్న జైన మహిళలందరూ మెగా మెహందీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జైనమతంలో, అక్షయ తృతీయ ముఖ్యమైనది, ఎందుకంటే ఇది మొదటి తీర్థంకరుడు, రిషబ్ దేవ్ భగవాన్ జ్ఞాపకార్థం, అతని చెరకు రసాన్ని అతని చెరకు రసాన్ని సేవించడం ద్వారా అతని ఒక సంవత్సరం సన్యాసాన్ని (తీవ్రమైన స్వీయక్రమశిక్షణ, అన్ని రకాల విలాసాలను నివారించడం) ముగించారు. కొందరు జైనులు ఈ పండుగను ఆకాశ తృతీయ పర్ణ మహోత్సవంగా పేర్కొంటారు. సన్యాసి అభ్యాసాలలో సాధారణ జీవనం, యాచించడం, ఉపవాసం, వినయం, కరుణ, ధ్యానం, ఓర్పు, ప్రార్థన వంటి నైతిక అభ్యాసాలు ఉన్నాయి. అక్షయ తృతీయ పర్ణ మహోత్సవ్ అటువంటి సంవత్సరం పాటు కొనసాగే కఠినమైన స్వీయక్రమశిక్షణకు ముగింపు పలికింది. గ్రేటర్ హైదరాబాలోని శ్రీ వర్ధమాన్ స్థానక్వాసి జైన్ శ్రావక్ సంఘ్ అక్షయ తృతీయ పర్ణ మహోత్సవ్ నిర్వహించనున్నారు.



# ఏ వైపు తిరిగి పడుకుంటున్నారు?

నిద్రపోయేటప్పుడు ఒక్కొక్కరూ ఒక్కో పొజిషన్‌లో పడుకుంటారు. కొందరు వెల్లకిలా పడుకుంటే కొందరు ఎడమవైపు, మరికొందరు కుడివైపు తిరిగి పడుకుంటారు. కొందరికి బోర్లా పడుకునే అలవాటు కూడా ఉంటుంది. అయితే పడుకునే పొజిషన్ కూడా మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. అన్నిరకాల పొజిషన్ల కంటే ఎడమవైపు తిరిగి పడుకుంటే శరీరంలో చాలా రకాల వ్యవస్థల పనితీరు బాగుంటుందని చెబుతున్నారు.

తరచుగా గుండెలో మంట, ఎసిడిటీతో బాధపడుతుంటే, నిద్రపోయేటప్పుడు ఎడమవైపు తిరిగి పడుకోవడం మంచిది. ఈ స్థితిలో జీర్ణాశయాన్ని, అన్నవాహికను కలిపే స్ఫింక్టర్‌కు కొంచెం కిందుగా జీర్ణాశయం ఉంటుంది. అందువల్ల ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణాశయంలోని పదార్థాలు, యాసిడ్ వెనక్కి వచ్చే అవకాశం ఉండదు. అందువల్ల ఎసిడిటీ సమస్య రాదు. కాలేయం శరీరానికి కుడి వైపు ఉంటుంది.

కాబట్టి కుడివైపు తిరిగి పడుకుంటే దీనిపై ఒత్తిడి పడుతుంది. శరీరంలోని టాక్సిన్లు కాలేయాన్ని చేరేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఎడమవైపు తిరిగి పడుకుంటే శరీరంలోని హానికర పదార్థాలు, టాక్సిన్లు కాలేయంపై భారం వేయకుండా నివారించవచ్చు. గుండె ఎడమవైపు భాగం ఊపిరితిత్తుల నుంచి రక్తాన్ని తీసుకుని మిగిలిన శరీర భాగాలకు పంపిస్తుంది. అందువల్ల ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల గుండె పంపింగ్ సామర్థ్యం మెరుగవుతుంది.





ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసులోనే ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా నాలుగో విజయంతో కదం తొక్కింది. ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ మ్యాస్ట్రో విరాట్ కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్‌కు తోడు రజత్ పాటిదార్, కామెరూన్ గ్రీన్ మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు పంజాబ్ ఎదుట భారీ లక్ష్యాన్ని నిలిపింది. అనంతరం బంతితో పంజాబ్‌ను కట్టడిచేసి ఘనవిజయం సాధించింది. ఈ ఓటమితో పంజాబ్ ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకున్న రెండో టీమ్‌గా నిలిచింది.

# బెంగళూరు జోరు

ఆర్సీబీకి నాలుగో విజయం

విరాట్ కోహ్లీ సెంచరీ మిస్

ప్లేఆఫ్స్ రేసు నుంచి పంజాబ్ ఔట్

ఆరంభంలో వరుస పరాజయాలతో నిరాశపరిచినా ఐపీఎల్ 17 రెండో దశ నుంచి జూలు విదిల్చిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి వరుసగా నాలుగో విజయం సాధించింది. బెంగళూరు నిర్దేశించిన 242 పరుగుల ఛేదనలో పంజాబ్.. 181 పరుగులకే చేతులెత్తేయడంతో 60 పరుగుల తేడాతో ఆర్సీబీ ఘనవిజయం సాధించింది. రన్ మిషీన్ విరాట్ కోహ్లీ (47 బంతుల్లో 92, 7 ఫోర్లు, 6 సిక్సర్లు) తృటిలో శతకం చేజార్చుకోగా రజత్ పాటిదార్ (23 బంతుల్లో 55, 3 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. భారీ ఛేదనలో పంజాబ్.. 17 ఓవర్లలో 181 పరుగులే చేయగలిగింది. రిలీ రూసో (27 బంతుల్లో 61, 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శశాంక్ సింగ్ (19 బంతుల్లో 37, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. కోహ్లీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

మ్యాచ్ ఆరంభంలోనే 3, 10 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కోహ్లీ ఇచ్చిన క్యాచ్‌లను పంజాబ్ ఫీల్డర్లు నేలపాలు చేయడంతో వచ్చిన అవకాశాన్ని అతడు సద్వినియోగం చేసుకున్నాడు. డుప్లెసిస్ (9), జాక్స్ (12) నిరాశపరిచినా పాటిదార్‌తో కలిసి ఆర్సీబీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. హర్షల్ పటేల్ 6వ ఓవర్లో 3 ఫోర్లు బాదిన పాటిదార్.. రాహుల్ చాహర్ 8వ ఓవర్లో 3 సిక్సర్లతో రెచ్చిపోయాడు. పాటిదార్ ఇచ్చిన రెండు క్యాచ్‌లనూ పంజాబ్ ఫీల్డర్లు జారవిడవడం ఆర్సీబీకి కలిసొచ్చింది. 21 బంతుల్లోనే అర్ధ శతకం చేసిన అతడిని సామ్ కరన్ ఔట్ చేశాడు. మరో ఎండ్‌లో కోహ్లీ.. లివింగ్‌స్టొన్ 13వ ఓవర్లో ఫోర్ కొట్టి హాఫ్ సెంచరీ పూర్తిచేశాక మరింత జోరు పెంచాడు. కరన్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు అర్ష్‌దీప్ 18వ ఓవర్లో 4,6తో 90లలోకి వచ్చిన విరాట్.. అదే ఓవర్లో నాలుగో బంతికి కవర్స్ వద్ద రూసోకు క్యాచ్ ఇచ్చి శతకాన్ని మిస్ చేసుకున్నాడు. ఆఖర్లో కామెరున్ గ్రీన్ (27 బంతుల్లో 46, 5 ఫోర్లు, సిక్స్), దినేశ్ కార్తీక్ (18) మెరుపులతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

కొండంత లక్ష్యాన్ని ఛేదించడానికి క్రీజులోకి వచ్చిన పంజాబ్ ఇన్నింగ్స్ నాలుగో బంతికే ప్రభ్‌సిమ్రన్ (6) వికెట్ కోల్పోయింది. వన్‌డౌన్‌గా వచ్చిన రూసో.. బెయిర్ స్టో(27)కు జతకలిసి దూకుడుగా ఆడాడు. 16 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్సర్‌తో ఊపు మీద కనిపించిన బెయిర్ స్టోను ఫెర్గూసన్ ఔట్ చేశాడు. ఎదుర్కున్న తొలి బంతి నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డ రూసో.. సిరాజ్ 4వ ఓవర్లో 3 ఫోర్లు, ఓ సిక్స్‌తో జోరు పెంచాడు. కానీ ఫెర్గూసన్ ఆరో ఓవర్లో బెయిర్ స్టోను ఔట్ చేశాడు. అతడి స్థానంలో వచ్చిన శశాంక్ సింగ్ కొంతసేపు పోరాడాడు. 20 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేసుకున్న రూసోను కర్ణ్ శర్మ బోల్తా కొట్టించడంతో పంజాబ్ తడబడింది. శశాంక్‌ను కోహ్లీ రనౌట్‌తో వెనక్కి పంపగా జితేశ్ (5), లివింగ్‌స్టొన్ (0), అశుతోష్ (8), కరన్ (22) విఫలమయ్యారు. లోయార్డర్ బ్యాటర్లను సిరాజ్ (3/43) ఔట్ చేయడంతో ఆర్సీబీకి భారీ విజయం సాధ్యమైంది. స్వప్నిల్‌సింగ్, ఫెర్గుసన్, కర్ణ్‌శర్మ రెండేసి వికెట్లు తీశారు.

**సంక్షిప్త స్కోర్లు**

బెంగళూరు: 20 ఓవర్లలో 241/7 (కోహ్లీ 92, పాటిదార్ 55, హర్షల్ 3/38, విద్వత్ 2/36). పంజాబ్: 17 ఓవర్లలో 181 (రూసో 61, శశాంక్ 37, సిరాజ్ 3/43, స్వప్నీల్ 2/28)

2, 90లలో ఔట్ అవడం ఐపీఎల్‌లో కోహ్లీకి ఇది రెండోసారి. 2013 సీజన్‌లో ఢిల్లీపై 99 పరుగుల వద్ద ఔట్



# చెమట పడితేనే కిడ్నీలో రాళ్లు చేరవు

చెమట పడితే చాలా చికాకుగా అనిపిస్తుంది. చెమట పట్టకుండా ఉండాలని ఎంతో మంది కోరుకుంటారు. నిజానికి చెమట పట్టడం ఆరోగ్యానికి మేలే చేస్తుంది.

చెమట పెడితే ముఖానికి వేసిన మేకప్ పోతుందని బాధపడేవారు ఎంతోమంది. ఎక్కువమంది చెమట పట్టకూడదని కోరుకుంటారు. కొంతమందికి చెమట అధికంగా పట్టదు. నిజానికి శరీరానికి చెమటలు పట్టడం అనేది ఆరోగ్యానికి మేలే చేస్తుంది. చెమట పట్టడం అనేది శరీరాన్ని చల్లబరిచే ప్రక్రియలో ముఖ్యమైనది. చెమట చర్మంపై ఉన్న స్వేద గ్రంథుల ద్వారా బయటికి స్రవిస్తుంది. అలా శ్రమించడం ద్వారా లోపల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. వేడి ప్రాంతంలో నివసించే వారికి చెమట అధికంగా పట్టే అవకాశం ఉంది. చెమట ద్వారా ద్రవాలన్నీ బయటికి పోతాయి. కనుక వారు ఎక్కువగా నీరు త్రాగుతూ ఉండాలి.

**చెమట వల్లే చర్మానికి మెరుపు**

వ్యాయామం చేసినప్పుడు శరీరం నిండా రక్తప్రసరణ సవ్యంగా జరుగుతుంది. ఇది చర్మం లోపల నుండి ఆరోగ్యకరమైన మెరుపును అందిస్తుంది. వ్యాయామం చేసేటప్పుడు చెమట విపరీతంగా పడుతుంది. ఇలా చెమట పట్టడం వల్ల మీ చర్మానికి మెరుపు సంతరించుకుంటుంది. ఆరోగ్యకరమైన రక్త ప్రవాహం చర్మ కణాలకు ఆక్సిజన్, పోషకాలను అందించడం వంటివి చేస్తుంది. రక్త ప్రవాహం ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం వంటివి చేయాలి. వ్యాయామం చేసేటప్పుడు చెమట పట్టడం సహజం.


ఏదైనా పని చేస్తున్నప్పుడు చెమట పడుతోంది... అంటే అర్థం మీ గుండెకు అంతా మేలే జరుగుతోందని. ఎక్కువ చెమట పట్టే వారు ఎక్కువగా పని చేస్తున్నారని అర్థం. మీ శరీరాన్ని శుభ్రపరిచి అత్యంత ప్రభావంవంతమైన మార్గాల్లో చెమట పట్టడం ఒకటి. చెమట శరీరంలో ఉన్న అధిక ఉప్పును కొలెస్ట్రాల్‌ను తొలగించడానికి సహాయపడుతుంది. చెమట రంధ్రాల ద్వారా వ్యర్థాలు, విషాలు బయటికి వచ్చేస్తాయి. కాబట్టి మొటిమలు, ఇతర చర్మ సమస్యలు రాకుండా ఉంటాయి.

**కిడ్నీలో రాళ్లు ఏర్పడవు**

చెమట అధికంగా పట్టే వారిలో కిడ్నీలో రాళ్ల సమస్య వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది. చెమట పట్టడం వల్ల అదనపు ఉప్పును బయటకు పంపించేస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడడానికి కారణం మూత్రంలో ఉప్పు, కాల్షియం వంటివి పేరుకుపోవడమే. ఎప్పుడైతే చెమట ఉప్పును బయటికి పంపించేస్తుందో ,కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం కూడా తగ్గుతుంది. చెమట పట్టడం వల్ల హానికరమైన అంటువ్యాధులు, క్రిములు వంటివి శరీరంలో చేరకుండా ఉంటాయి. చెమటలో యాంటీ మైక్రోబయల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. ఇవి బ్యాక్టీరియాను శరీరంలో చేరకుండా బయటికి పంపిస్తూ ఉంటాయి. కాబట్టి చెమట పడుతుందని బాధపడవద్దు. రోజులో ఎంతో కొంత సేపు చెమట పట్టడం శరీరానికి అన్ని విధాలా మంచిది.




# బంపర్ ఆఫర్ కొట్టేసింది



నేషనల్ క్రష్ రష్మిక మందన్న బంపర్ ఆఫర్ కొట్టేసింది. పుష్ప2, యానిమల్ సినిమాలతో పాన్ ఇండియా హీరోయిన్‌గా అవతరించిన ఈ అందాలబొమ్మ.. త్వరలో సల్మాన్‌ఖాన్‌తో జతకట్టనుంది. సల్మాన్‌తో మురుగదాస్ రూపొందిస్తున్న 'సికిందర్' సినిమాలో హీరోయిన్‌గా రష్మికను ఎంపిక చేసినట్టు మేకర్స్ గురువారం ప్రకటన విడుదల చేశారు. 'మా 'సికిందర్'లో సల్మాన్‌ఖాన్ జోడీగా నటించేందుకు రష్మికకు ఆహ్వానం పలుకుతున్నాం. ఈ జంట ఆన్‌స్క్రీన్ మ్యాజిక్ త్వరగా చూడాలని కోరుకుంటున్నాం. వచ్చే ఈద్ పండుగకి సల్మాన్, రష్మిక తెరపై సాక్షాత్కరిస్తారు.' అంటూ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై తన ఇన్‌స్టాలో రష్మిక స్పందిస్తూ 'నా నెక్ట్స్ సినిమా అప్డేట్ చెప్పమని అభిమానులు తరచూ అడుగుతుంటారు. వారికోసం అద్భుతమైన అప్‌డేట్ ఇస్తున్నా. సల్మాన్‌సార్‌కి జోడీగా 'సికిందర్'లో నటిస్తున్నా. ఈ అవకాశాన్ని గౌరవంగా, గర్వంగా భావిస్తున్నా' అని తెలిపింది నేషనల్ క్రష్.



# పద్మవిభూషణ్ చిరంజీవికి అభినందల వెల్లువ..!

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ఇవాళ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా దేశ అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ అందుకున్నారు. కళారంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యే చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు ప్రకటించింది. దీన్ని ఆయన ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో జరిగిన కార్యక్రమంలో ముర్ము నుంచి అందుకున్నారు. దీంతో చిరంజీవికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు లభించడం పట్ల ద్రౌపదీ ముర్ము స్పందించారు. "తన సినిమాల ద్వారా, మానవతా సేవల ద్వారా ప్రజల జీవితాలను స్పృశించిన ప్రముఖ నటుడు. చిరంజీవి పార్లమెంటు సభ్యునిగా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. అతను మార్గదర్శక ప్రయత్నాలను కూడా చేసాడు. అనేక సామాజిక కారణాల కోసం విస్తృతంగా పనిచేశాడు." అని తెలిపారు.

# కత్తి నేనే.. యుద్ధం నాతోనే!



అగ్ర హీరో విజయ్ దేవరకొండ గురువారం తన జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కొత్త సినిమాలకు సంబంధించిన ప్రకటనలు వెలువడ్డాయి. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మాతగా రవికిరణ్ కోలా దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా తెరకెక్కనుంది. గురువారం విజయ్ దేవరకొండకు బర్త్‌డే విషెస్ తెలియజేస్తూ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విజయ్ దేవరకొండ కత్తిపట్టుకొని వయొలెంట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. 'కత్తి నేనే.. నెత్తురు నాదే.. యుద్ధం నాతోనే' అనే క్యాప్షన్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నది. గ్రామీణ నేపథ్యంలో యాక్షన్ అంశాలతో ఈ సినిమా రూపొందనుంది. ఇక మరో సినిమా వివరాల్లోకి వెళితే.. విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నది. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనుంది. గురువారం కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. బీటలువారిన పొలాల మధ్యలో ఓ వీరుడి రాతి విగ్రహం కనిపిస్తుండగా.. దానిపై 'ది లెజెండ్ ఆఫ్ కర్స్' అనే క్యాప్షన్ రాసి ఉంది. 1854 నుంచి 1978 మధ్యకాలంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. కొత్తగా ప్రకటించిన ఈ రెండు చిత్రాలు రూరల్ యాక్షన్, పీరియాడిక్ డ్రామా కథాంశాలతో తెరకెక్కనుండటంతో విజయ్ దేవరకొండ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# జాక్వెలిన్ ఫెర్నాండేజ్‌తో పేపర్ బాయ్ దర్శకుడి కొత్త మూవీ!

సున్నితమైన ఎమోషన్స్‌ను ఎంతో అద్భుతంగా పేపర్ బాయ్ సినిమాలో చూపించి మెప్పించాడు దర్శకుడు జయ శంకర్. ఇక రెండో ప్రయత్నంగా అరి అంటూ అరిషడ్వర్గాల మీద చిత్రాన్ని తీశాడు. ఇప్పటికే ఈ మూవీ అందరిలోనూ ఆసక్తిని క్రియేట్ చేసింది. పలువురు సెలెబ్రిటీలు సినిమాను చూసి మెచ్చుకున్నారు కూడా. ఇక త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే ఈ క్రమంలో దర్శకుడు జయ శంకర్ కొత్త సినిమా మీద రూమర్లు వస్తున్నాయి. ఆల్రెడీ ఈయన ఓ లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్ మీద ఫోకస్ పెట్టినట్టుగా, ఆ కథకు నయనతార ఓకే చెప్పినట్టుగా ఆ మధ్య రూమర్లు వచ్చాయి. అయితే ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ మీద కొత్త రూమర్ వినిపిస్తోంది. జయశంకర్ అనుకుంటున్న ఈ లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌కు సౌత్, నార్త్‌లో మంచి క్రేజ్ ఉన్న నటిని తీసుకున్నారని సమాచారం. శ్రీలంక భామ జాక్వెలిన్ ఫెర్నాండేజ్‌తో జయ శంకర్ తన లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌ను చేస్తున్నాడని తెలుస్తోంది. పాన్ ఇండియాగా ఈ ప్రాజెక్ట్ ఉంటుందని తెలుస్తోంది. మరి ఈ ప్రాజెక్ట్ మీద అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి. ఇక జయశంకర్ తీసిన అరి చిత్రం ఈ ఎన్నికల హడావిడి అయిపోయిన తరువాత థియేటర్లోకి రానుంది. జూన్‌లో ఈ సినిమాను విడుదల చేసేందుకు దర్శక నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com